క్లుప్తంగా

మహిళల అక్రమరవాణాను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న దిశ ఎస్‌ఐ లక్ష్మీదేవి

వైవీయూ : మహిళలు, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని దిశ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీదేవి, మురళీమోహన్ పేర్కొన్నారు. శనివారం యువజన సర్వీసు లశాఖ ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె మండలంలోని భారత్ మహిళల ఇంజినీరింగ్ కళాశాలలో 'మహిళల అక్రమ రవాణ– దిశ యాప్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎన్ని చట్టాలు వచ్చినా ఇప్పటికీ చాలా దేశాల్లో మనుషుల అక్రమ రవాణా బాధితుల సంఖ్య లక్షల్లోనే ఉంటోందన్నారు. దిశ వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల సమాచారం ఉంటే పోలీసులకు అందించాలన్నారు. స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు, కరస్పాండెంట్ ఫరూఖ్ అహ్మద్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీపై చర్యలకు డిమాండ్

కడప సెవెన్‌రోడ్స్ : మహిళా మల్లయోధులను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బషీరున్నీసా కోరారు. శనివారం కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రమిచ్చారు. బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయడంతోపాటు పార్లమెంటు సభ్యత్వాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

వేధింపులు ఆపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మున్సిపల్ కార్మికులపై నగర పాలకసంస్థ అధికారుల వేధింపులను ఆపాలని సీఐటీయూ నగర కార్యదర్శి సుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను నగర పాలక సంస్థ సెక్రటరీలు వేధిస్తున్నారని ఆరోపించారు. వారి ఆగడాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయని తెలిపారు. నిత్యం నగరాన్ని శుభ్రపర్చడంలో శ్రమిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ నాయకులు చంద్ర, సుంకర రవి, తిరుపాల్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

తమ పార్టీ అధినేత రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశాన్ని నాశనం చేస్తోందని మండిపడ్డారు. నోట్ల రద్దు ప్రధాని మోదీ చేతగానితనానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, ఏఐసీసీ మెంబర్ బండి జకరయ్య విమర్శించారు.

'రామస్వామి సేవలు చిరస్మరణీయం'

వైవీయూ : ఉపాధ్యాయ లోకానికి కె. రామస్వామి చేసిన చేసిన సేవలు చిరస్మరణీయమని ఆర్‌జేయూపీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని భుజంగరావు టీచర్స్‌హోంలో కె. రామస్వామి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఓబులరెడ్డి, హోం ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ప్రచార కార్యదర్శి బాబు, సీనియర్ నాయకులు వీరయ్య, వీరన్న, సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు నిశ్శబ్ద ర్యాలీ

కడప రూరల్: అంతర్జాతీయ కొవ్వొత్తుల సంస్మరణ దినం సందర్భంగా ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి నిశ్శబ్ద ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి ఖాదర్‌వలి తెలిపారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై సమాజాన్ని చైతన్య పరచేందుకు కొవ్వొత్తులను చేతపట్టి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6.30 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ఐటీఐ సర్కిల్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం వరకు చేపట్టే ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సహకారాలతో డీడీయూజీకేవై పథకం ద్వారా సీడప్ సౌజన్యంతో వైఎస్సార్, ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలల కాలవ్యవధిలో ఉచితంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్టు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7013665112, 9059160549 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణకు ట్రిపుల్ ఆర్ సెంటర్లు

కడప కార్పొరేషన్: 'మేరీ లైఫ్, మేరీ స్వచ్ఛ షహర్' ప్రచారంలో భాగంగా కడప నగరంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్) కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. శనివారం కడప నగరపాలక సంస్థ ఎదుట ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ కేంద్రాన్ని ఆయన మహిళలు, కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ కేంద్రంలో పాత బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, పాత బట్టలు, చెప్పులు, గాజు వస్తువులు, పాత ఎలక్ట్రానిక్ వస్తువులు, చెక్కతో చేయబడిన పాత వస్తువులు స్వీకరిస్తామన్నారు. ఈ వస్తువులను సేకరించిన తర్వాత వాటిని పునర్వినియోగం కోసం, పునర్నిర్మించడానికి లేదా కొత్త ఉత్పత్తులుగా చేయడానికి ఉపయోగిస్తామన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా తమ ఇళ్లలోని వ్యర్థ ఎలక్ట్రానిక్ వస్తువులను ఈ కేంద్రాలకు అందజేయాలని సూచించారు. ప్లాస్టిక్, ఈ–వేస్ట్ వల్ల హానికరమైన కెమికల్స్ ఉత్పత్తి అయి పర్యావరణానికి కీడు కలుగుతుందన్నారు. ఫలితంగా మానవాళికి అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. 23వతేది మూడు చక్రాల వాహనాలలో, 24, 25 తేదీల్లో ట్రిపుల్ వాహనాల ద్వారా వ్యర్థాల స్వీకరించడం జరుగుతుందన్నారు. 29న కోటిరెడ్డి సర్కిల్ నుంచి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్



ఏపీహెచ్‌బీ కాలనీలో ట్రిపుల్ ఆర్ సెంటర్ వద్ద ఎంహెచ్‌ఓ ప్రశాంత్‌వర్ధన్ తదితరులు

గోకులం వరకూ సైకిల్ ర్యాలీ జరుగుతుందని, జూన్ 4వ తేది టెన్‌కే రన్ ఉంటుందని, జూన్ 5న ప్రతిజ్ఞ, భారీ పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మే 21న నగరవనం నుంచి పాల కొండల వరకూ ట్రెక్కింగ్‌నిర్వహిస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు షఫీ, నాగేంద్ర, డివిజన్ ఇన్‌చార్జులు కె. రాజశేఖర్‌రెడ్డి, బాలక్రిష్టారెడ్డి, బండి ప్రసాద్, జి. శ్రీనివాసులరెడ్డి, రెడ్డి ప్రసాద్, మేనేజర్ హిదాయతుల్లా పాల్గొన్నారు.

● మార్నింగ్ విజిట్‌లో భాగంగా కమిషనర్ ప్రవీణ్‌చంద్ రాయ చోటి అండర్‌బ్రిడ్జి పార్కు, సంధ్యా సర్కిల్ ఫుట్‌పాత్, డ్రైన్, రాజీవ్ మార్గ్, రాజీవ్ పార్కు, మాసాపేట రోడ్డు, కేసీ కెనాల్ రోడ్డు పనులను పరిశీలించారు.

● పర్యావరణ పరిరక్షణకు కడప నగరంలో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. ప్రశాంత్‌వర్ధన్, 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఏపీహెచ్‌బీ కాలనీలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌వర్ధన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించడం కోసం మానవాళి జీవన శైలిని మార్చుకోవాల్సిన అవసరముందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, తిరిగి ఉపయోగించడం, వేరే రూపంలోకి మార్చి ఉపయోగించడం ద్వారా పర్యావరణానికి హానికరంగా మారిన ప్లాస్టిక్‌ను నిరోధించవచ్చన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్లే వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని తెలిపారు. కడప నగరంలోని 100 సచివాలయాల పరిధిలో సుమారు 150 సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ–వేస్ట్‌ను కూడా సేకరించి రీసైకిల్ చేయడం జరుగుతుందన్నారు. ఒక విధంగా చెప్పాలంటే కడప మున్సిపల్ కార్పొరేషనే గుజరీ షాపులు నిర్వహిస్తుందని చెప్పారు. ప్రజలు, మున్సిపల్ కార్మికులు ఈ మేరకు సహకరించాలని కోరారు. మలేరియా అధికారి భరత్ కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సునీల్, వార్డు సచివాలయ సెక్రటరీలు, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన జేవీవీ వేసవి శిక్షణ శిబిరం

కడప కల్చరల్ : వేసవి సెలవులను ఉపయుక్తంగా మార్చుకోవాలని, ఈ ఖాళీ సమయాన్ని జ్ఞాన సాధన కోసం ఉపయోగించేలా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా శిక్షణ శిబిరాలను నిర్వహించామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఏడీ దేవదత్తం అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రతి వేసవిలోనూ ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తున్నామని, నాలుగైదేళ్లుగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ శిబిరాలకు కూడా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సంవత్సరం ఎండలు అసాధారణంగా ఉండడంతో కేవలం నెల రోజుల శిబిరాన్ని కేవలం 20 రోజులకు కుదించామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ మార్పు చేశామన్నారు. చివరిరోజు విద్యార్థులకు అందంగా రాయడం, వృథా వస్తువులతో అందమైన, ఆకర్షణీయమైన వస్తువులను తయారు చేయడం, సంగీతం, నృత్యం, కథా పఠనం, వ్యాకరణం, గణితం తదితర అంశాలను నేర్పారు. శిబిరంలో ప్రావీణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు పతకాలు, పుస్తకాలను అందజేశారు.



బహుమతులు పొందిన చిన్నారులతో జేవీవీ సంస్థ ప్రతినిధులు

ఆంధ్రకేసరికి నివాళి ... ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ సమత విభాగం నాయకులు రామేశ్వరమ్మ, నగర కమిటీ యూత్ నాయకులు మధు, ఉపాధ్యక్షులు కరీముల్లా పాల్గొన్నారు.

రూబిక్స్ క్యూబ్ ప్లేతో చురుకుదనం

కడప కల్చరల్: రూబిక్స్ క్యూబ్ ప్లే ద్వారా జ్ఞాపకశక్తి పెరిగి బాలలు చురుగ్గా ఉండగలరని ఆ విభాగం నిపుణులు, శిక్షకులు ఎల్.చరణ్ నరసింహా అన్నారు. కడప నగరంలోని కొండాయపల్లెలోగల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం ఆయన రూబిక్స్ క్యూబ్ ప్లే గురించి వివరించారు. ఈ పద్ధతిని సాధన చేయడం ద్వారా జ్ఞాపక శక్తి, సృజన శక్తి, సమస్య, పరిష్కార నైపుణ్యం అలవడతాయన్నారు. మెదడు, చేయి, కన్నుల మధ్య సమన్వయాన్ని మెరుగు పరుస్తుందన్నారు. విద్యార్థులకు క్యూబ్‌లు ఇచ్చి సాధన చేయించారు. అనంతరం సైన్స్ శిక్షకులు రవికుమార్ విద్యార్థులతో నిత్య జీవితంలో సామాన్యశాస్త్రం, అందులో కాంతి నియమాలు, లక్షణాల గురించి వివరించారు. శిక్షకులు సత్యవతి ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడటం నేర్పగా, లైబ్రేరియన్ జేమ్స్ కథ చెప్పడం గురించి వివరించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, లైబ్రేరియన్లు సురేష్, సుబ్రమణ్యం, జేమ్స్, నవాజ్‌జాన్, సిబ్బంది శ్రీనివాసులు, రాం ప్రతాప్, నాగలక్ష్మి, సుబ్బమ్మ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల విద్యార్థులు చదువుల్లో రాణించాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని దూదేకుల విద్యార్థులు చదువుల్లో బాగా రాణించి దేశానికి సేవలు అందించాలని దూదేకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మన్సూరు అక్బర్ అన్నారు. కడప నగరంలోని మున్సిపల్ ఉర్దూ స్కూలులో పదవ తరగతిలో 565 మార్కులు సాధించిన రెడ్డి సమీర, 534 మార్కులు సాధించిన రసూల్‌బీ అనే విద్యార్థులను శనివారం డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో సన్మానించారు. ఎవరి ప్రోత్సాహం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 500 మార్కులు సాధించిన నిరుపేద దూదేకుల విద్యార్థులకు ప్రోత్సాహం కింద గిఫ్ట్ అందిస్తామన్నారు. డీహెచ్‌పీఎస్ సలహాదారు బాబయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుప్పం మల్లి, వర్కింగ్ కార్యదర్శి గగ్గటూరు నజీర్, ట్రెజరర్ రూపనగుడి హుసేన్ తదితరులు పాల్గొన్నారు.



టెన్త్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న సంస్థ నాయకులు

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

వల్లూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునని సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రవీణ తెలిపారు. వల్లూరులోని శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా శనివారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తీర్చిదిద్దుకోవాలన్నారు. పరిశుభ్రత వల్ల కలిగే ఉపయోగాలను గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవం.. కడప రాయుడి మాసోత్సవం

కడప కల్చరల్ : తిరుమలేశుని తొలి గడపగా భావించే దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి మాసోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు త్రివిక్రమ్ బృందం తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకం, అనంతరం అలంకారం నిర్వహించారు. పూజల అనంతరం శ్రీవారిని ఇరువైపుల శ్రీదేవి, భూదేవిలతోసహా రథంపై కొలువుదీర్చారు. స్వామి, అమ్మవార్లను స్థానిక భక్తులు దర్శించుకుని పూజా ద్రవ్యాలు సమర్పించి మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రథంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

చల్లంగా చూడు తల్లీ!

కడప కల్చరల్ : మా పిల్లా పాపలను చల్లంగా చూడు తల్లీ! అంటూ భక్తులు బాల పోలేరమ్మకు మొక్కుకున్నారు. కడప నగరం చిన్నచెప్పవీధిలోని శ్రీ బాలపోలేరమ్మ జాతర రెండవరోజు ఘనంగా నిర్వహించారు.

తొలుత అమ్మవారి మూలమూర్తికి పంచామృతాభిషేకం, శుద్ధజలం తదితరాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని కనుల పండువగా సువర్ణ ఆభరణాలు, పుష్పమాలలతో అలంకరించారు. జాతర అలంకారంలో భాగంగా ప్రత్యేకంగా పలువురు భక్తులు సమర్పించిన నిమ్మకాయల మాలలను కూడా అమ్మవారికి అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా వేప మండలతో తీర్చిదిద్దారు. భక్తులు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో చల్లకుండలను, పాత్రలను తలపై ధరించి కుటుంబ సమేతంగా మేళతాళాల మధ్య ఊరేగింపుగా తెచ్చి పోలేరమ్మ అమ్మవారికి సమర్పించారు. అర్చకులు వేదమంత్రోచ్చాటనలతో పూజలు నిర్వహించి భక్తులు సమర్పించిన చల్లనే తిరిగి వారికి అమ్మవారి ప్రసాదంగా అందజేశారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.



విశేష అలంకారంలో శ్రీ బాల పోలేరమ్మ



అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు

చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాలి

● పేదల ఇళ్లను సమాధులతో పోల్చడం దారుణం

● సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్: పేదల ఇళ్లను సమాధులతో పోల్చిన ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇల్లు మనకు ఆశ్రయమిచ్చే గుడి అని, ఇల్లు ఉంటే భద్రత, భరోసా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు నిర్మించుకోవడం ఒక కల అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఐదేళ్లలో 25లక్షల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని, నాలుగేళ్లలోపే 31లక్షల పైచిలుకు ఇళ్లు ఇచ్చారన్నారు. టీడీపీ పాలనలో ఐదేళ్లలో రెండు లక్షల మందికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇవ్వగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ స్థలం లేకపోయినా 60వేల ఎకరాలు రూ.30వేల కోట్లు ఖర్చు చేసి ఇచ్చిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ఒక ఆస్తి రూపంలో ఇళ్లను ఇస్తోందని, కొన్నిచోట్ల ఇవి రూ.5లక్షల నుంచి రూ.10లక్షల విలువ చేస్తున్నాయన్నారు. పేదల ఇళ్లను శ్మశానంతో, సమాధులతో పోల్చడం చంద్రబాబు దురహంకారానికి నిదర్శనమన్నారు. అద్దె కట్టుకోలేనివారు కంపు కొడతారని, పేదలు నివసిస్తున్న ప్రాంతాలు మురికివాడలని దారుణమన్నారు. పేదల శరీరాలు కాదు మీ మనసు కంపు కొడుతోందని తెలిపారు. రాబోయే ఎన్నికలు పేదలు, పెత్తందారులకు మధ్య జరుగబోతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథరెడ్డి, ఎస్. ప్రసాద్‌రెడ్డి, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీకే దిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్

భక్తిశ్రద్ధలతో హజరత్ బంగ్లేషావలీ ఉరుసు



ఫకీర్ల మేళతాళాల మధ్య గంధం కలశాన్ని తీసుకొస్తున్న ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తదితరులు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని గండివాటర్ వర్క్స్ వద్దగల హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అబ్దుల్ ఖాదర్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రీ అలియాస్ బంగ్లేషావలీ ఉరుసు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులైన కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి సజ్జాద నషీన్ హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఈ సందర్భంగా తమ స్వగృహం నుంచి గంధం కలశాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చారు. అనంతరం గురువుల మజార్ వద్ద గంధాన్ని భక్తిశ్రద్ధలతో సమర్పించి ఫాతెహా చేసి భక్తులకు ప్రసాదాలను అందజేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా పరిసరాలు నిండిపోయాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఖవ్వాలీ గాయకుల భక్తిగానం ఉర్రూతలూగించింది.

రాష్ట్రం వైపు.. దేశం చూపు

● ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సాగిస్తున్న జగనన్న ప్రభుత్వం పాలనను దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులందరూ గమనిస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పెద్దచెప్పలి సచివాయల పరిధిలోని పెద్దచెప్పలి, పి.కొత్తపల్లె, ఈడిగపల్లె గ్రామాలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలను, జరిగిన లబ్ధిని వివరించారు. ఆయా గ్రామాల్లో రోడ్లు, ఇండ్లు, ఇంటి స్థలాలు, భూములకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు చెబుతున్న సమస్యలను అక్కడే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఈ పాలనను దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్య మంత్రులు గమనిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలు నభూతో నభవిష్యత్ అన్నారు. రైతులు పడుతున్న కష్టాలను నివారించడానికి ప్రతి 2వేల జనాభాకు ఒక ఆర్‌బీకే నిర్మించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులు, యంత్రాలు అన్ని రకాల సేవలు రైతు ముంగిటకే చేర్చుతున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. ఏపీలోని ఆర్‌బీకేలను ఇతర రాష్ట్రాల మంత్రులు, కేంద్ర మంత్రులు సైతం ఏపీకి వచ్చి పరిశీలించి వారి రాష్ట్రాల్లో కూడా ఏర్పాటు చేసుకుంటున్నారని కొనియాడారు. ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకూడదని భావించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు ఇంటికే చేర్చుతున్నారని, ఇంటి వద్దకే పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్దచెప్పలి చిన్ని, పి.చంద్రశేఖర్, మనోహర్‌రెడ్డి, నామాల శేఖర్, మర్రి సుబ్బన్న, చంద్రపాల్, చంటి, వెంకటసుబ్బయ్య, తిరుపాల్, గంగరాజు, దుబ్బయ్య, మైసూరారెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర, నిఖిల్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మస్తానయ్య, మహ్మద్ గౌస్ చెన్నారెడ్డి, అయ్యవారు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పి.కొత్తపల్లెలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

ప్రైవేట్ అధ్యాపకులపై ఒత్తిడి తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రైవేట్ అధ్యాపకులపై ఒత్తిడిని ఆపాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో ఎండలు విపరీతంగా ముండుతున్నాయని తెలిపారు. ఈ సమయంలో బయటకు రావాలంటే భయపడుతున్న సమయంలో ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు, విద్యా సంస్థలు ప్రచారం కోసం ఊరు వాడలు తిప్పుతున్నారని తెలిపారు. ముందస్తు అడ్మిషన్ల ప్రచారాలు ఆర్భాటాలు నిర్వహిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. డీవైఎఫ్‌ఐ నాయకులు విజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు యంత్రాంగంలో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సరెండర్ లీవుల మొత్తాన్ని ఆయా ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేశారు. దీనిపై ఏపి పోలీసు అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నర్రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మొత్తాన్ని పోలీసుల బ్యాంకుఖాతాల్లో జమచేయడంతో ఒక్కొక్కరికి రూ. 90 వేల నుంచి రూ. లక్ష లేదా ఆపైన మొత్తం వస్తుందని ఆయన తెలియజేశారు.

22 నుంచి ఉద్యోగుల సమస్యలపై దీక్షలు

కడప రూరల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22 నుంచి జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్‌కుమార్ తెలిపారు. ఆ మేరకు శనివారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 22న ప్రొద్దుటూరు, 23న సిద్దవటం, 25న పులివెందుల, 26న బద్వేలు, 27న జమ్మలమడుగు, 29న కమలాపురం, 31న కడపలో దీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రఘురామ నాయుడు, ట్రెజరర్ చంద్రశేఖర్, నగర అధ్యక్షులు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరహాలనాయుడు సేవలు చిరస్మరణీయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శిగా వరహాల నాయుడు అందించిన సేవలు చిరస్మరణీయమని ఆ యూనియన్ రీజినల్ సెక్రటరీ పురుషోత్తం తెలిపారు. శనివారం ఆర్టీసీ గ్యారేజీ వద్ద తృతీయ వర్ధంతి సందర్భంగా వరహాలనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ జేఏసీ అమరావతి వైఎస్సార్ జిల్లా జనరల్ సెక్రటరీ కృష్ణకుమార్, ఆర్టీసీ అధికారులు శివయ్య, కమలేష్‌బాబు, నాయక్, చంద్రశేఖర్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

పేదలంటే బాబుకు ఎప్పుడూ చులకనే

కడప సిటీ : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు పేదలంటే ఎప్పుడూ చులకనేనని ఆంధ్ర రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ వైవీ డేవిడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు చేసే దుష్ప్రచారాలను తిప్పి కొడతామన్నారు. ఆయన పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. జగనన్న కాలనీలను సమాధులతో పోలుస్తారా? అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆర్ఎస్ జోన్‌ను సమాధులను పోల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఏ ఒక్కరికైనా ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఈసారి ఎన్నికల్లో కూడా టీడీపీకి శాశ్వత రాజకీయ సమాధేనని తెలిపారు.

బీసీల సమస్యలపై 25న చలో అమరావతి

కడప రూరల్: బీసీ వర్గాల సమస్య పరిష్కాం కోసం ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న చేపట్టిన చలో అమరావతి కార్యక్రమంను జయప్రదం చేయాలని ఆ సంఘం చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు వీర భాస్కర్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు హాజరవుతారని తెలిపారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు పోలీసు శాఖ కృషి

కడప అర్బన్: ప్రజల దాహార్తి తీర్చేందుకు పోలీసుశాఖ కృషి చేస్తోందని కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తెలియజేశారు. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో 'చలివేంద్రాల'ను ప్రారంభించారు. శనివారం కడప ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్ ముందు సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, సిబ్బందితో కలిసి చలివేంద్రంను ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ సౌకర్యాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.